# ఓ కండక్టర్ కథ

ఆంజనేయుల్ని తల్లిదండ్రులు అల్లారుముద్దుగానే పెంచారు. అందువల్ల అతనికి పెంకితనం, మొండితనంలాంటి అవలక్షణాలు రాలేదుగాని ప్రపంచ భయం, భీతి తనంతతానుగా ఏమీ చేయలేని పిరికితనం లాంటివి అలవడ్డాయి. ఒక్కగానొక్క కొడుకు. అందులోను లేక లేక కలిగిన సంతానం కావడంవల్ల ఆంజనేయుల్ని తల్లిదండ్రులు ఎక్కువగా బైటికి వెళ్ళనిచ్చేవారు కాదు. తోటి పిల్లలతో ఆడుకోనిచ్చేవారు కాదు. అతన్ని బైటికు పంపడానికి భయపడేవారు. దానివల్ల నలుగురిలో మసలాలంటే భయం. స్వతంత్రించి ఏదయినా చెయ్యాలన్నా ఆలోచించాలన్న భీతి అతనిలో ఏర్పడ్డాయి.

వయసొచ్చి స్కూల్లో చేరాకకూడా అతని పరిస్థితిలో మార్పు లేదు.

ఆంజనేయులుకి చదువంటే శ్రద్ధ. దేవుడన్నా, గురువులన్నా భక్తి. పెద్ద మనుషులన్నా పెద్దతనమన్నా, పెద్ద లోకమన్నా భయం వున్నాయి.

చదువు పూర్తయి చాలాకాలమయినా ఆంజనేయులికి ఉద్యోగం రాలేదు.

అతను ఉద్యోగం లేదని బాధపడినప్పుడల్లా- "బెంగ పెట్టుకోకురా- అదే దొరుకుతుంది" అనేది తల్లి.

ఉద్యోగం లేదన్న బెంగ మిగిలిపోయింది. ఉద్యోగం చేయాలన్న కోరిక పెరిగిపోయింది.

కొడుకు బెంగ పడుతున్నాడని తెల్సిన తలిదండ్రులు బాధ పడ్డారు. ఏంచెయ్యాలా అని ఆలోచించారు.

కొడుక్కి పెళ్ళిచేస్తే కాస్త ధోరణి మారుతుందని ఆలోచించారు. ఆంజనేయులికి ఇష్టంలేదు. కాని తలిదండ్రుల్ని కాదనలేక వచ్చిన సంబంధం చూడ్డానికి ఒప్పుకున్నాడు. చూసి పిల్ల నచ్చలేదని చెపితే సరిపోతుందనుకున్నాడు.

పిల్లని చూడ్డానికి తలిదండ్రులతో కల్సి వెళ్ళాడు.

* * *

ఇందిర మెరుపుతీగలా వుండదుకాని ఆమెను చూడగానే ఎవరికైనా మనసులో ఓ చిన్న మెరుపు కదులుతుంది. ఆమెది గులాబీ పువ్వులా కొట్టొచ్చే అందంకాదు మల్లెపూవులా నిర్మలమైన అందం. ఇందిర చలాకీగా వుంటుంది. ఆమె తెలివైనది, అంతేకాదు- తెలివైనదానిలా కనిపిస్తుంది.

ఇందిరకు చిన్నప్పుడే తల్లిపోతే సవిత్తల్లి సరిగా చూడదేమోనని భయపడి అమ్మమ్మ తీసికెళ్ళింది. ఇందిరను అమ్మమ్మ, మేనమామ, అతని భార్య బాగానే చూశారు.

ఆంజనేయులు ఇందిరను చూసుకోడానికి వచ్చాడు. చూడగానే అతని మనసులో ఓ మెరుపు కదిలింది. కదిలిన ఆ మెరుపుని డబ్బు

మీద ఆలోచన లేని అంజనేయులు కప్పెట్టెయ్యకుండా బయటికి తెలియ జేసేశాడు.

"నేనీ అమ్మాయిని చేసుకుంటా నాన్నా!" అని అందరి ఎదు రుగా తండ్రికి చెప్పాడు.

అది విన్న అందరూ ఆశ్చర్యపోయారు.

ఇందిరకు, ఆమె మేనమామకు మాత్రం భయం కలిగింది. ఆమెను చూడగానే చేసుకుంటానని చాలామంది ముందుకు వచ్చారు. కాని కట్నం దగ్గరకు వచ్చేసరికి అందరూ పారిపోయారు.

తల్లిలేని పిల్లని, మా అమ్మ దానిని చిన్నప్పుడే తీసుకొచ్చింది. కన్నకూతురుకన్నా ఎక్కువగా పెంచాను. మళ్ళీ దాని తండ్రి దాన్ని గురించి పట్టించుకోలేదు. మీరు నచ్చిందన్నారు సంతోషం.... కాని ముందే చెప్పేస్తున్నాను. నేను ఎక్కువ కట్నం ఇవ్వలేను. ఇంటే ఇందిరలాంటి బంగారంలాంటి పిల్లకు ఎంతయినా ఇద్దును. కాని నా దగ్గర లేదు బాబూ- అలాగని ఊరికే చేసుకొమ్మని అడగడం లేదు. నా శక్తికొద్ది...."

"కానీ కట్నం వద్దు. మా వాడికి పిల్ల నచ్చింది. తల్లిలేని పిల్లను పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పించారు. మీ మంచితనం గొప్పది. మీలాంటివాళ్ళు వుండబట్టే ఇంకా ఈ ప్రపంచం ఇలా మనగలుగు తోంది. మీ పిల్లని మా వాడికి చేసుకుంటాం.... సామాన్యంగా పెళ్ళి జరిపించండి చాలు...." అన్నాడు ఆంజనేయులు తండ్రి....

ఆంజనేయులు తండ్రికేసి గౌరవ భావంతో చూశాడు. ఇందిర ఆంజనేయుల్ని అతని తండ్రిని కృతజ్ఞతాపూర్వకంగా చూసింది. ఆమె కళ్ళలో నీళ్లు నిండాయి.

పెళ్ళి జరిగింది.

ఆంజనేయుల్లో కొత్త ఉత్సాహం, జీవితంపట్ల కొత్త ఇష్టం ఏర్పడ్డాయి.

మొదటి రాత్రి ఇందిర సిగ్గుతో ముడుచుకుపోయింది. ఆంజనేయులుకూడా బిడియంగానే వున్నాడు.

రెండోరోజు రాత్రి కాస్తంత చనువుగా ప్రవర్తించింది. ఆంజనేయుల్లో ఉత్సాహం పెరిగింది- ఆ రాత్రే "ఈ మనిషిని నేనే ముందుండి నడిపించాలి" అనుకుంది ఇందిర.

మూడోరాత్రి ఇద్దరు పిల్లలతో ఆపేద్దాం" అని ఇందిర అన్నప్పుడు ఆంజనేయులు ఆశ్చర్యపోయాడు. ఆడాళ్ళు అలా మాటాడుతారని అతనూహించలేదు. ఇందిర తనకన్నా ఎంతో తెలివైనదిగా ప్రపంచమంతా తెలుసుకున్నదిలా కనిపించింది.

అతనికి తన జీవిత పథాన్ని నిర్ణయించి నడిపించే నేత దొరికినట్టుగా అనిపించింది. అతనికి ప్రపంచమంటే భీతి భయం తగ్గినట్టుగా వుంది.

అతనెక్కడో చదివాడు.

"ప్రపంచంలో విజయం సాధించిన ప్రతి పురుషుడి వెనకాల ఒక స్త్రీ వుంది." బహుశా వాళ్ళంతా ఇందిరలాంటి వాళ్లేమో అనుకున్నాడు.

పెళ్ళయిన కొత్తలో కొన్నాళ్లు మర్చిపోయాడు కాని ఆంజనేయులికి మళ్ళీ ఉద్యోగం బెంగ మొదలయింది. ఉద్యోగం లేకుండా ఖాళీగా వున్నాననే భావన అతనిలోంచి పోగొట్టాలని ఇందిర ఎంత ప్రయత్నించినా ఫలితం కనబల్లేదు....

ఆమె తన మేనమామను సలహా అడిగింది. హైద్రాబాద్ వెడితే ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని తనకు తెల్సున్నవాళ్ళు సహకరిస్తారని అతను సలహా చెప్పాడు.

ఇందిర ఆ విషయం భర్తకి, అత్తమామలకి చెప్పి ఒప్పించింది. మొదట ఆంజనేయులు ఇందిర హైద్రాబాద్ వెళ్ళడానికి, అతనికి

ఉద్యోగం వచ్చాక అతని తలిదండ్రులు హైద్రాబాద్ వెళ్ళడానికి నిర్ణయించబడింది.

ఆ రకంగా ఆంజనేయులు దంపతులు హైద్రాబాద్ వెళ్ళడం జరిగింది.

చాలాకాలం ప్రయత్నించిన మీదట ఆంజనేయులికి ఉద్యోగం దొరికింది.

అదీ....

ఆర్టీసీలో కండక్టర్ ఉద్యోగం.

అతని ఆనందానికి అవధుల్లేవు. ఇందిరమీద ఆమె మేనమామ మీద కృతజ్ఞతతో ఆతని గుండె నిండిపోయింది. వెనకాల కొద్దిగా ఆస్తివున్నా స్వతంత్రంగా సంపాదించి బతకాలన్న తాపత్రయం ఉండడంవల్ల ఆ కోరిక తీరబోతున్నందువల్ల అతనికి చాలా చాలా సంతోషం కలిగింది.

ఉద్యోగంలో జాయిన్ కమ్మని ఆర్డర్స్ వచ్చాయి. అతన్ని హైద్రాబాద్‌లోనే ఓ డిపోలో వేశారు. ముందు కొద్ది వారాలపాటు ట్రైనింగ్ ఉంటుంది. అదయ్యాక సిటీబస్‌లో కండక్టరుగా వేస్తారు.

ఆంజనేయులు ఎన్నోసార్లు సిటీబస్‌లో ప్రయాణం చేశాడు. అందులో పనిచేసే కండక్టరు ప్రయాణికులతో రఫ్‌గా మాట్లాడం, ఏమాత్రం మర్యాద లేకుండా ప్రవర్తించడం, ప్రయాణికులమీద గట్టిగా అరవడం, సిటీబస్ తనదైనట్టుగాను, ప్రయాణికులు తన దయాధర్మ భిక్షలమీద ఆధారపడి ఉన్నట్టుగా ప్రవర్తించడం.... ఇవన్నీ చూశాడు.

ప్రతి బస్‌మీద పెద్ద పెద్ద అక్షరాలతో "ప్రజాసేవయే మా కర్తవ్యం" అని రాసి వుండటం చూశాను.

బస్‌మీద రాసివున్న దానికి పొంతనలేని కండక్టర్ ప్రవర్తనని నిరసించాడు. నవ్వుకున్నాడు.

తనకి ఉద్యోగం రాగానే మొట్టమొదట తీసుకున్న నిర్ణయం-ప్రయాణీకులతో మర్యాదగా ప్రవర్తించడం అలా అనుకున్నప్పుడు అతనికి గర్వం కలిగింది.

ట్రైనింగ్ పూర్తయి పోస్టింగ్ ఇచ్చారు.

తను డ్యూటీకి వెళ్ళాల్సిన రోజు రానే వచ్చింది.

పెందలాడే నిద్రలేచి తలంటు పోసుకుని సుల్తాన్ బజారులోని హనుమాన్ గుడికి వెళ్ళాడు. కొబ్బరికాయ కొట్టి గంగ సింధూరం బొట్టు పెట్టుకున్నాడు. ఇంటికి వెళ్ళి తొందరగా భోజనం ముగించుకుని కొత్తగా కుట్టించుకున్న టెరీకాట్ ఖాకీబట్టలు వేసుకున్నాడు.

డ్యూటీకి వెడుతూంటే ఇందిర ఎదురొచ్చింది.

డిపో కెళ్ళగానే టిక్కెట్లు, ఛార్టు వగైరా ఇచ్చి ఆరో నెంబరు రూట్లో ఆరోజు డ్యూటీ చెయ్యమని చెప్పారు. డ్రైవర్ బస్ తీసుకొచ్చాడు. ఆంజనేయులు అందులో ఎక్కాడు.

"కొత్తగా చేరావా?" అడిగాడు డ్రైవర్.

"అవునండి" అన్నాడు వినయంగా ఆంజనేయులు.

"కొత్తగా చేరినోణ్ణి ఈ రూట్లో. పైగా ఈ టైములో ఏసారేంటయ్యా బాబూ!" అన్నాడు డ్రైవర్ అదోలా ముఖంపెట్టి.

"నేనీ రూట్‌లో డ్యూటీ చెయ్యలేనంటారా?" అన్నాడు.

"చూద్దువుగాని.... ఈ రూట్‌లో పాసింజెర్లంతా ఆఫీసుల్లో పని చేసేవోళ్ళు, చదూకునేవోళ్ళు. పేరుకి అంతా చదూకున్నోళ్ళే కాని ఈళ్ళకన్నా మన కంట్రీసైడు గేదెలు కాసుకునేవాళ్ళు నయం. అందులోను కొత్తాడంటే నీ తిప్పలు నీ కెట్టేస్తారు."

డ్రైవర్ మాటలువిన్న అంజనేయులికి నోట మాట-రాలేదు. నాలుక ఎండిపోయింది. వళ్ళంతా నిరుత్సాహం ఆవరించింది.

డ్రైవర్‌కి యాభైయేళ్ళ వయసుంటుంది. పాత సిటీబస్‌లా మనిషి నలిగిపోయాడు. బట్టతల అతని జీవితానుభవాన్ని చెప్పక చెపుతోంది. చుట్టపొగ మింగేసి ముక్కులోంచి వదలడంవల్ల మనిషి నిరంకుశుడిలా కనిపిస్తున్నాడు. బస్ నడపడం చుట్ట కాల్చడంకన్నా సులువన్నట్టుగా వున్నాయి అతని చూపులు.

"మీ పేరు" ఆంజనేయులు తెచ్చిపెట్టుకున్న నవ్వుని ముఖం మీద గుచ్చుకుని అడిగాడు.

"పైడయ్య...."

"చూడండి పైడయ్యగారూ నేనీ డ్యూటీలో ఈవేళ చేరాను-నాకంతా కొత్తగా, అయోమయంగా వుంది. మీ మాటలతో మరింత భయం పట్టుకుంది.... మీరు కాస్త ఇవ్వేళ్టికి సాయపడితే రేపట్నుంచి అదే అలవాటయిపోతుంది. ప్లీజ్...."

ఆంజనేయులు బతిమాల్తూ అడిగాడు.

"నా సాయం నీకేటి ఉపయోగం? స్టీరింగొదిలేసి టిక్కెట్లు కొట్టమంటావా ?"

నిజమే- డ్రయివర్ కండక్టర్‌కి ఏ రకంగా సాయం చెయ్యగలడు?- అన్న అనుమానం ఆంజనేయులికూ్కడా కలిగింది.

"అహహ.... అదికాదు, మాటసాయం.... కాస్తంత మీరున్నారన్న ధైర్యం- అదే చాలు."

"నేనుండక బస్సొదిలి ఎల్లిపోతానా ?"

డ్రైవర్ పైడయ్య బస్ స్టార్టు చేశాడు.

బస్ డిపోనుంచి సరాసరి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ దగ్గరకొచ్చి ఆగింది. అక్కడ ప్రయాణీకులు ఆకలితోవున్న గెద్దల్లా, రాబందుల్లా వున్నారు. బిలబిలమని తోసుకుంటూ, రాసుకుంటూ, గెంతుకుంటూ పడుతూ లేస్తూ బస్ ఎక్కేస్తున్నారు. సీట్లకోసం దొమ్మి లాంటిది జరుగుతోంది.

కాస్సేపటిలో బస్ బైల్దేరింది.

బతికుండగానే నరకాన్ని చూపించే బస్.

పెరుగుతున్న దేశ జనాభాని మీ కళ్ళకు చూపించే బస్.... మనిషి సహనంలోని శిఖరాన్ని మనిషి అసహనంలోని అట్టడుగుని చూపించే బస్.... రాష్ట్ర, దేశ, ప్రాపంచిక రాజకీయాలు మీకు విని పింపజేసే బస్.... ఆఫీసులకి చేరేటప్పటికి ఉద్యోగస్తుల్ని నిర్జీవుల్ని చేసే బస్.... కొన్ని నిముషాలపాటు జీవితేచ్ఛ, అన్న హితవు, స్త్రీ వాంఛ అన్నీ చంపేసి మనిషిని యోగిగా, ఋషిగా చేసే బస్....

బస్ బైల్దేరింది.

ఆంజనేయులు టికెట్లు కొట్టడం మొదలెట్టాడు.

ఎవరి ధోరణిలో వారున్నారు.

డి.ఎ. పెంపుదలనుంచి న్యూట్రాన్ బాంబుదాకా అన్నివిషయాలు చర్చించబడుతున్నాయి.

ఆంజనేయులు ఎంతో మర్యాదగా, వినయంగా అడుగుతున్నాడు టికెట్ ఇస్తున్నాడు. అలవాటు లేని కారణంగా జనాన్ని తోసుకుని వెళ్ళడం అతనికి కష్టంగా వుంది.

బస్ చార్మినార్ కంపెనీ దాటగానే ఆపేశాడు డ్రైవర్.... అది

లాస్టు టికెట్ ఇష్యూయింగ్ పాయింట్- ఆ స్టేజి దాటేలోగా బస్‌లో వున్న ప్రయాణీకులందరికీ టికెట్లు ఇచ్చెయ్యాలి. పైగా ఏ టిక్కెట్లు ఎన్ని కొట్టాడో ఓ ఫారంలో రాయాలి.

ఇందులో ఏది చెయ్యకపోయినా చెకింగ్ ఇన్‌స్పెక్టర్ కండక్టర్ మీద కంప్లయింట్ రాయొచ్చు.

ఆంజనేయులికి అవస్థగా వుంది.

ఏ ప్యాసింజర్‌కి ఎంత టికెట్ కొట్టాలో తెలియటంలేదు. ప్యాసింజర్ని అడగాల్సి వస్తోంది. లేదా ఛార్టు చూడాల్సి వస్తోంది.

లేటయిపోతుందని అప్పటికే ప్రయాణీకులు సణుగుడు మొదలు పెట్టారు. ఆ రూట్‌లో చాలా ఆఫీసులున్న కారణంగా ఆ బస్ చాలా రద్దీగా వుంటుంది. పైగా పాలిటెక్నిక్ కాలేజీ స్టూడెంట్లు కూడా ఆ బస్‌లోనే ఎక్కుతారు. అంచేత ఇంకాస్త జాగ్రత్తగా వుండాలి.

సిటీలో ఏ ఆందోళన జరిగినా అది పాలిటెక్నిక్ దగ్గర తీవ్ర రూపందాల్చి ఆర్టీసీ బస్‌మీద దాని ప్రభావం చూపిస్తుంది.

ఈ విషయం జ్ఞాపకం వచ్చి ఆంజనేయులికి వళ్ళంతా చెమట్లు పోశాయి.

అయినా ధైర్యం కూడదీసుకుని టికెట్లు కొడుతున్నాడు. ప్రయాణీకులు సహకరించడంలేదు. ఒకాయన నలభై పైసల టికెట్‌కి పది రూపాయల నోటిచ్చాడు.

"చిల్లరివ్వండి శార్...."

"లేదయ్యా- చిల్లర నిల్లరంటే ఎక్కణ్ణుంచి వస్తుంది. ప్రతీవాళ్లు బాగా నేర్చారు"- ప్రయాణీకుడు గదిమాడు.

ఆంజనేయులికి ఏం చెయ్యాలో తోచలేదు- టికెట్ వెనకాలరాసి తర్వాత ఇద్దామన్నా- దిగాల్సిన స్టేజి వచ్చేసరికి పదిరూపాయల చిల్లర పోగవదు. అదే కొంచెం ముదిరిన కండక్టరయితే "చిల్లరిస్తే ఇవ్వండి. లేదా దిగండి" అనేవాడు. ఆ విషయం ఆంజనేయులికి, ఆ ప్రయాణీకుడికి కూడా తెలుసు.

కాని ఆంజనేయులు కొత్తగా చేరాడని వాళ్ళకి తెల్సిపోయింది.

"చిల్లర లేకపోతే ఎలాసార్? ఇదేమో ఫస్ట్ ట్రిప్...." ఆంజనేయులు దీనంగా మొహంపెట్టి అన్నాడు.

"ఇదిగో నా దగ్గర ముప్పైఫైసలున్నాయి- ఏం చేసినాసరే నీ ఇష్టం" అన్నాడు ప్రయాణీకుడు.

నలభై పైసలయ్యేదానికి ముప్పైపైసల టికెట్ కొట్టడం ఆంజనేయులికి ఇష్టంలేదు. పదిపైసల నష్టం తనే భరిద్దామనుకున్నాడు. ముప్పైపైసలు తీసుకుని నలభై పైసల టికెట్ ప్రయాణీకుడి చేతిలో పెట్టాడు.

గవర్నమెంట్‌లో ఓ మాదిరి మంచి ఉద్యోగమే చేస్తున్న ఆ ప్రయాణీకుడు పదిపైసల లబ్ధికి యెంతో సంతోషించాడు. పైగా ముసిముసి నవ్వులు నవ్వాడు.

"ఏవయ్యా- ఆఫీసుకి ఎప్పుడు చేరుస్తావ్ ? లంచ్ టైంకి ముందా తర్వాత?" ఓ ఉద్యోగి అడిగాడు.

"వెళ్ళిపోదాం సార్.... కొత్తమూలాన లేటవుతోంది" ఆంజనేయులు సంజాయిషీ ఇచ్చుకున్నాడు.

"కొత్త బిచ్చగాడికి పొద్దు తెలియదట" వెనకాల్నుంచి ఎవరో అన్నారు. ఆంజనేయులు విననట్టుగా ఊరుకున్నాడు.

ఎవరో బెల్ కొట్టారు.

"బాబూ.... ఎవరూ బెల్ కొట్టకండి సార్...." ఆంజనేయులు విజ్ఞాపన. ఈసారి గట్టిగా ఒకటికి పదిసార్లు బెల్ కొట్టారు జనం నవ్వులు.

"ఒరేయ్.... మనమెల్లాగూ కాలేజీ టైంకి వెళ్ళలేం, బస్ దిగి రోడ్ పక్కన కూర్చుని టిఫిన్ బాక్సులు విప్పి తినేద్దాం" ఓ స్టూడెంట్ అన్నాడు మళ్ళీ నవ్వులు.

టికెట్లు కొట్టడం ముగిసిందనిపించి "పైడయ్యగారూ- పోనియ్యండి" అన్నాడు.

బస్ బైల్దేరింది.

ఒక్కో స్టేజి దాటుతున్నకొద్దీ జనం ఇంకా ఇంకా ఎక్కేస్తున్నారు. బర్కత్‌పూరా సెంటర్ దగ్గర కొచ్చేసరికి బస్ పూర్ణగర్భిణీ గేదెలా వుంది. టర్న్ తిరుగుతున్నప్పుడు కుయ్యో మొర్రో మంటోంది.

ఆంజనేయులు ఎంత చెప్పినా లాభంలేదు.

బస్ లిబర్టీ దగ్గరికి వచ్చింది.

ఆంజనేయులు టికెట్లు కొడుతూ వెనకాల్నుంచి కిందకు దిగాడు. పుట్‌బోర్డు మీదున్నవారికి, ఎక్కబోతున్న ప్యాసింజర్లకి టిక్కెట్లు ఇస్తున్నాడు. అది పూర్తయ్యాక ముందునించి ఎక్కి ఆడాళ్ళకి టిక్కెట్లిద్దామని అతని ఆలోచన. అతను కింద వుండగానే ఎవరో బెల్ కొట్టారు.

డ్రైవర్ ఏ పరాకులో వున్నాడో తెలియదు. బస్ స్టార్టు చేసేశాడు. హోల్డాన్ హోల్డాన్ అంటూ ఆంజనేయులు బస్ వెనకాలే పరు

గెత్తాడు. "కండక్టర్ కిందే వున్నాడు" అని ఓ పాసింజర్ అరిచాడు. కొంతదూరం వెళ్లాక డ్రైవరు బస్సాపాడు.

ఆంజనేయులు ముందునుంచి బస్సెక్కాడు.

"కండక్టర్ని వదిలేసి వెళ్ళిపోవాల్సింది. రేపు సాయంత్రానిగ్గాని ఆఫీసుకు చేరుకోలేం" ఒక ఉద్యోగస్తురాలు మరొకామెతో ఆంజనేయు లుకి వినపడేటట్టే చెప్తోంది.

రెండో ఆమె నవ్వుతోంది.

ఆఫీసుకు లేటైపోతోందని ప్రతి ఒక్కరూ కండక్టర్ మీద విసు క్కుంటున్నారు. "నీలాంటి కొత్తాణ్ణి ఈ రూట్లో వెయ్యడానికి వాళ్ళకి బుద్ధిలేదటయ్యా?" ఒకాయన మొహంమీదే అడిగాడు.

ఆంజనేయులికి చిన్నతనమనిపించింది.

ఫస్ట్ ట్రిప్ అయిందనిపించేసరికి తాతలు దిగొచ్చారు. మధ్యా హ్నం వరకు ఫరవాలేదు. మళ్ళీ స్కూళ్లు, కాలేజీలు, వదిలేటైంనుంచీ రష్ మొదలవుతుంది.

ఆఫీసులు వదిలే టైముకి మళ్ళీ బస్ ఒకరకంగా మారుతుంది.

ఆంజనేయులికి ఇప్పట్నుంచి భయంగా వుంది.

మధ్యాహ్నం మూడుగంటల ట్రిప్‌లో సరోజినీదేవి హాస్పిటల్ దగ్గర చెకింగ్ స్టాఫ్ ఎక్కారు.

అప్పుడే బస్‌లో ఎక్కువమంది ప్రయాణీకులు కూడా లేరు. వాళ్లు లోనికి ఎక్కగానే ముందు ఆంజనేయులు దగ్గర టిక్కెట్లు తీసేసు కున్నారు. ప్రయాణీకులందరి దగ్గరా టిక్కెట్లున్నాయో లేవో తనిఖీ చేశారు. గళ్ళ బుష్షర్టు వేసుకున్న ప్రయాణీకుడి దగ్గర తప్ప మిగతా అందరి దగ్గర టిక్కెట్లున్నాయి.

ఆంజనేయులికి బాగా గుర్తుంది.

గళ్ళ బుష్టర్టు ప్రయాణికుణ్ని తను రెండుసార్లు అడిగాడు. రెండుసార్లు అతను టిక్కెట్టు తీసుకున్నానని చెప్పాడు. చూడ్డానికి చదువుకున్నవాడిలా, మర్యాదస్తుడిలా వున్నాడు ఏభై అరవై పైసలకి అలాంటి వాళ్ళు యెందుకు కక్కుర్తి పడతారో అతనికి అర్థం కాలేదు.

ఏ స్టేజీలో ఎన్ని టిక్కెట్లు కొట్టాడో ఫారంలో నింపలేదన్నది చెకింగ్ ఇన్‌స్పెక్టర్ చేసిన రెండో ఆరోపణ.

తను కొత్తనీ, బస్ నడుస్తుండగా ఆ ఫారం నింపడం చాత కావటం లేదని ఆంజనేయులు చెప్పాడు. డ్రైవర్ కూడా కలుగజేసుకుని కండక్టర్ కొత్తవాడని, రిపోర్టు రాయొద్దని చెప్పాడు.

అడిగే వాడికి చెప్పేవాడు లోకువ.

"ఇహ ముందు జాగ్రత్తగా వుండు!" అని హెచ్చరించి ఇన్‌స్పెక్టర్ దిగిపోయాడు.

గళ్ళ బుష్టర్టుని అడిగితే "తీసుకున్నా ననుకున్నాను. గుర్తు లేదు" అన్నాడు. ఆంజనేయులు టికెట్టిచ్చి డబ్బులు తీసుకున్నాడు. అదే కొంచెం సీనియర్ కండక్టరయితే గళ్ళ బుష్టర్టు కాలరట్టుకుని బస్‌లోంచి బయటికి గెంటేసేవాడు.

ఆరోజు డ్యూటీ అయ్యిందనిపించి క్యాష్ టిక్కెట్లు అప్పజెప్పడానికి ఆంజనేయులు డిపోకి వెళ్ళాడు. ఇరవై రూపాయలదాకా క్యాష్‌లో తేడా వచ్చింది. చేతినుంచి కట్టుకున్నాడు.

బాధగా ఇంటికి చేరాడు.

డబ్బు కట్టాల్సి వచ్చినందుక్కాదు, ఆ రోజు అనుభవాలు తన

కళ్ళముందు తిరుగుతున్నాయి. తను టికెట్లు కొట్టలేకపోవడం, చిల్లర లేని ప్రయాణికులు తనని దబాయించడం, కొత్తవాడని జనం అవహేళన చేయడం, తనని ఆట పట్టించిన కుర్రాళ్ళు, వాళ్ళ నవ్వులు, తను బస్ దిగాక బెల్ కొట్టడం, బస్ కదిలిపోతుంటే దాని వెనకాల తనపరుగు కొత్తాడని తెల్సీ ఉద్యోగస్తురాళ్లు చేసిన కామెంట్లు, నవ్విన నవ్వులు, తనమీద కంప్లయింట్ రాస్తానన్న చెకింగ్ ఇన్స్పెక్టర్, టికెట్ కొనని గళ్ళషర్టు....

ఇందిర ఇచ్చిన కాఫీతాగి కుర్చీని ఆలోచిస్తున్నాడు. కొత్తవాడులే అన్న జాలి, తోటి మనిషిమీద సానుభూతిలేని ప్రయాణికులు.... గెద్దల్లా, కాకుల్లా, రాబందుల్లా తనని హింసించిన జనం....

కండక్టర్లంతా ఇందువల్లే రఫ్‌గా, అమర్యాదగా ప్రవర్తిస్తారేమో ? మెతకగా వుంటే.... అందరూ తనలాగే అవమాన పడతారేమో ?

ఏ ఆఫీసులోనో ఉద్యోగంలో చేరితే పైవాడు పని నేర్పుతాడు. స్లోగా చేసినా అర్థం చేసుకుంటాడు. ఒకటికి నాలుగుసార్లు చెప్తాడు. విసుక్కున్నా, కసురుకున్నా ఒక్కడే....

కాని కండక్టర్ ఉద్యోగం అలాకాదు.

పబ్లిక్‌తో సంబంధం.... అన్నివందల కళ్లు.... నవ్వి, హేళన చేసి, చూపులలో పొడిచి, హింసించి....

ఆంజనేయులికి బాధ.... మనసులో సుళ్లు తిరుగుతున్న బాధ ... ఇందిర "అలా వున్నారేం?" అని చాలా సార్లడిగింది.

"ఏం లేదు" అని మాత్రం చెప్పాడు.

భోజనాలు చేసినప్పుడుకూడా అన్యమనస్కంగా వున్నాడు. నాలుగు మెతుకులు కతికి లేచిపోయాడు. వంటింట్లో పనులన్నీ ముగించుకుని ఇందిర గదిలో కొచ్చేసరికి ఆంజనేయులు మంచంమీద వెల్లకిలా పడుకుని శూన్యంలోకి చూస్తున్నాడు.

ఆమెకి ఆందోళనగా వుంది. భర్త యేం జరిగిందీ చెప్పడం లేదు, లైటు తీసేసి మంచంమీద అతని పక్కనే పడుకుని "ఏవండీ.... మీరలా వుంటే నాకు భయంగా వుంది. ఏం జరిగిందో చెప్పరూ ?" అంది.

ఆ తరువాతరోజు జరిగినదంతా చెప్పాడు.

చివర్న "నేను ఇన్నాళ్లు ఉద్యోగంకోసం తాపత్రయపడ్డాను. కాని ఈ ఉద్యోగం చెయ్యలేను. నేనిలాంటి ఉద్యోగానికి పనికిరాను. రేపట్నుంచి వెళ్ళను" అన్నాడు.

ఇందిర భర్తని తనవైపు తిప్పుకుని అతని ముఖాన్ని తన గుండెలకు హత్తుకుంది. అతని కన్నీళ్ళ తడి ఆమె గుండెలకు తగిలింది.

"కళ్ళనీళ్లెట్టుకుంటున్నారా ? మీరు మగాళ్ళు.... ఇంత బేలగా వుంటే యెలా? నాలుగురోజులు పోయాక అలవాటయిపోతుంది. గళ్ళ బుష్షర్టుగాణ్ని కాలర్ పట్టుకుని బస్సులోంచి దింపేసే ధైర్యం మీకే వస్తుంది. ఇప్పటికి భయపడి ఈ ఉద్యోగం వదిలేస్తే తర్వాత మీరే బాధ పడతారు, కొంచెం ధైర్యంగా వుండి నిగ్రహం చూపండి" అంది.

అతనామె గుండెల్లో మొహం దాచుకున్నాడు. ఆమె గుండెలు మల్లెపూలంత మెత్తగా వెన్నెలంత చల్లగా, చల్లనంత హాయిగా వున్నాయి. ఆంజనేయులికి ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

ఆమెను పెనవేసుకున్నాడు.

ఇందిర తన జీవితాన్ని సక్రమంగా నడిచేట్టు చూసే కండక్టర్‌లా అనిపించింది కండక్టర్ ఆంజనేయులికి.

— "జ్యోతి" అక్టోబర్ 1983